


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
మంగళవారం
25-03-2025
పేజీలు: 02


# వెంటాడి వేటాడి.. తండ్రిని చంపించిన కన్న కూతురు





గ్రామంలో ఆధిపత్యం కోసం మామను అతికిరాతంగా హత్య చేయించాడు సొంత అల్లుడు. నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో హత్యకు గురైన మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్యగౌడ్ హత్య కేసులో 13 మంది నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ విలేకరులకు వెల్ల డించారు.

చక్రయ్యగౌడ్ ఆధిపత్యం సహించలేక..

మెంచు చక్రయ్యగౌడ్ గ్రామంలో పెద్దమనిషిగా చలామణి అవుతూ గ్రామ సర్పంచ్‌గా కూడా పనిచేశాడు. అతడికి ఐదుగురు కుమార్తెలు సంతానం. తన మూడో కుమార్తె కనకటి సునీతను కూడా సర్పంచ్‌గా, మూడో అల్లుడు కనకటి వెంకన్నను పీఏసీఎస్ చైర్మన్‌గా చేశాడు. అల్లుడు కనకటి వెంకన్న పీఏసీఎస్ చైర్మన్ అయిన్నప్పటి నుంచి నూతనకల్ మండలంలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాడు. గ్రామంలో చక్రయ్యగౌడ్ ఆధిపత్యం ఉండటం వెంకన్న వర్గీయులు సహించలేకపోయారు. చక్రయ్యగౌడ్‌కు వ్యతిరేకంగా వెంకన్న వర్గీయులు ఒక గ్రూపుగా ఏర్పడడంతో వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం 2023లో చక్రయ్యగౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2024లో కనకటి వెంకన్న కూడా కాంగ్రెస్‌లోకి వచ్చాడు. అయినప్పటికీ గ్రామంలో చక్రయ్యగౌడ్ ఆధిపత్యం కొనసాగుతోంది. దీంతో ఎలాగైనా మామ చక్రయ్యగౌడ్‌ను అడ్డు తొలగించుకోవాలని కనకటి వెంకన్న నిర్ణయించుకున్నాడు.

బొడ్రాయి మహోత్సవంలో హత్యకు పథకం..

ఈ నెల 13న మిర్యాల గ్రామంలో బొడ్రాయి మహోత్సవం జరిగింది. గతంలో కనకటి వెంకన్న ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగేవి, చక్రయ్యగౌడ్ ఈసారి ఉత్సవాలను తన ఆధ్వర్యంలో జరపాలని బహిరంగంగా ప్రకటించడంతో వెంకన్న తట్టుకోలేకపోయాడు. దీంతో ఎలాగైనా చక్రయ్యగౌడ్‌ను హత్య చేయాలని తన వర్గీయులను కొంతమందిని వెంకన్న పురమాయించాడు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం చక్రయ్యగౌడ్ తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి వస్తుండగా.. అతడి మొదటి అల్లుడు కనకటి ఉప్పలయ్య, ఐదో అల్లుడు కనకటి లింగయ్యతో పాటు వెంకన్న అనుచరులైన కనకటి శ్రవణ్, కనకటి శ్రీకాంత్, గంధసిరి వెంకటేష్, పెద్దింటి మధు, పెద్దింటి గణేష్ అడ్డగించి మారణాయుధాలు, వెదురు కరల్రతో చక్రయ్యగౌడ్‌పై దాడి చేసి హత్య చేశారు. ఇదంతా దూరంగా నుంచి గమనిస్తున్న వెంకన్న చక్రయ్యగౌడ్‌పై దాడి జరిగగానే అతడు చనిపోయాడని నిర్ధారించుకుని అక్కడి నుంచి అందరూ పారిపోయారు. ఈ హత్యపై నూతనకల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సోమవారం ఉదయం తుంగతుర్తి పరిధిలో వాహనాల తనిఖీల్లో భాగంగా.. చక్రయ్యగౌడ్ హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న అతడి మొదటి అల్లుడు కనకటి ఉప్పలయ్యతో పాటు హత్యకు కుట్ర పన్నిన మూడో అల్లుడు కనకటి వెంకన్న, వెంకన్న భార్య సునీత, మొదటి కుమార్తె కనకటి స్వరూప, ఐదో కుమార్తె కనకటి కల్యాణితో పాటు దిండిగల నగేశ్, జక్కి పరమేష్, మన్నెం రమేశ్, కనకటి వెంకన్న అలియాస్ మొండి వెంకన్న.



## తుది శ్వాస విడిచిన పవన్ కల్యాణ్ గురువు

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గురువు, ప్రముఖ కోలీవుడ్ నటుడు షిహాన్ హుసైని తుది శ్వాస విడిచారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. నేడు (మంగళవారం) చనిపోయారు. హుసైని మృతిని ధ్రువీకరిస్తూ.. ఆయన కుటుంబ సభ్యులు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. బసంత్ నగర్‌లోని హుసైని నివాసంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు.'హుసైని మృతి చెందారని తెలపడానికి బాధపడుతున్నాము ఆయన మృత దేహాన్ని బసంత్ నగర్ నివాసంలో సాయంత్రం వరకు ఉంచుతున్నాము. సాయంత్ర 7 గంటలకు ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తున్నాము‘ అని కుటుంబ సభ్యులు వెల్లడించారు. హుసైని మృతిపై పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.హుసైని.. ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణ్‌కు మార్షల్ ఆర్ట్స్, కరాటే, కిక్ బాక్సింగ్‌లో ట్రైనింగ్ ఇచ్చారు. ఆర్చరీలోనూ శిక్షకుడిగా ఉన్నాడు హుసైని. ఈ రంగంలో ఆయన సుమారు 400 మందికి పైగా ట్రైనింగ్ ఇచ్చారు.హుసైని 1986లో రిలీజ్ అయిన పున్నగై మన్నన్ సినిమా ద్వారా కోలీవుడ్‌కు పరిచయం అయ్యారు. పలు చిత్రాల్లో నటించారు. అయితే విజయ్ హీరోగా నటించిన బద్రీ సినిమా హుసైనికి గుర్తింపునిచ్చింది.



## ఏప్రిల్‌లో మెగా డీఎస్సీ ప్రకటిస్తా

రాష్ట్రంలో ఉపాధ్యాగ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుడ్‌న్యూస్ చెప్పారు. మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. మంగళవారం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడుతూ.. డీఎస్సీపై స్పష్టత ఇచ్చారు. వచ్చే నెలలో (ఏప్రిల్) మెగా డీఎస్సీ ప్రకటిస్తామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణతోనే డీఎస్సీ పోస్టుల భర్తీ ఉంటుందన్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి పోస్టింగ్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.


## ఇంజినీరింగ్ విద్యార్థుల దుర్మరణం

అతి వేగం ఇద్దరు విద్యార్థుల నిండు ప్రాణాలను తీసుకుంది. ఈ సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం దుమ్ముగూడెం ప్రగలపల్లి గ్రామానికి చెందిన బంటు రాజ్‌కుమార్(20), పెద్దపల్లి జిల్లా, గోదావరిఖనికి చెందిన అటికెటి సిద్దార్థ(21) ఓయూ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఆదివారం రాత్రి వీరు ఓయూ హాస్టల్ నుంచి బైక్‌పై విద్యానగర్ వెళుతుండగా అడిక్‌మెట్ ఫ్లైఓవర్‌పై వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి కిందపడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరూ అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## SLBC టన్నెల్ ప్రమాద ఘటనలో బయటపడ్డ మరో మృతదేహం!

సాయంత్రానికి బయటకు తీసుకొచ్చే ఛాన్స్



శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం ప్రమాదంలో మరో మృతదేహం లభ్యమైనట్లు తెలిసింది. రెస్క్యూ సిబ్బంది తవ్వకాలు జరుపుతుండగా మృతదేహం ఆనవాళ్లు లభించినట్లు తెలుస్తుంది. కన్వేయర్ బెల్ట్‌కు 50 మీటర్ల దూరంలో దుర్వాసన వస్తున్నట్లు గుర్తించిన సిబ్బంది.. ఆ ప్రాంతంలో తవ్వకాలు జరుపుతున్నారు. ముందుగా గుర్తించిన అనుమానిత ప్రాంతాలు డీ1, డీ2 కాకుండా మరోచోట తవ్వకాలు జరుపుతుండగా ఈ మృతదేహం ఆనవాళ్లు లభించినట్లు తెలిసింది. అయితే, ఈ మృతదేహానికి సంబంధించిన సమాచారాన్ని అధికారులు ఇంకా ధ్రువీకరించలేదు. కొద్దిసేపటి క్రితమే అధికారులు టన్నెల్ లోపలికి వెళ్లారు. ఆనవాళ్లు మృతదేహానివే అయితే సాయంత్రానికల్లా బయటకు తీసుకొచ్చే ఛాన్స్ ఉంది. ప్రస్తుతం గ్యాస్ కట్టర్ల సాయంతో కన్వేయర్ బెల్ట్ శిథిలాలను తొలగిస్తున్నారు. కాగా, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగి ఇప్పటికే నెల రోజులు గడిచిపోయింది. గత నెల 22న ప్రమాదం జరగ్గా.. అందులో చిక్కుకున్న 8 మంది ఆచూకీ కోసం దేశంలోనే అన్ని ప్రముఖ రెస్క్యూ టీంలను రంగంలోకి దింపారు. ఆర్మీ. ఎన్డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్, సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్, కేరళ కేడావర్ డాగ్స్ స్క్వాడ్ వంటి వాటితో రెస్క్యూ చేపట్టారు. గత 15 రోజుల క్రితం గురుప్రీత్ సింగ్ అనే కార్మికుడి మృతదేహం లభ్యమైంది.

## సెన్సార్ పూర్తి చేసుకున్న నితిన్ సమ్మర్ ఎంటర్టైనర్!

టాలీవుడ్ యువ హీరో యూత్ స్టార్ నితిన్ హీరోగా శ్రీలీల హీరోయిన్ గా దర్శకుడు వెంకీ కుడుముల తెరకెక్కించిన అవైటెడ్ చిత్రం "రాబిన్ హుడ్" కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రం కొంచెం లేట్ అయినా కూడా ఇపుడు మంచి బుకింగ్స్ ని కనబరుస్తుంది అని చెప్పవచ్చు. ఇలా ప్రస్తుతం ఈ సినిమా సెన్సార్ పనులు కూడా ముగించుకున్నట్టుగా మేకర్స్ ఇపుడు కన్ఫర్మ్ చేశారు. సెన్సార్ యూనిట్ వారు ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ ని ఇచ్చినట్టుగా తెలిపారు. ఇక ఈ సమ్మర్ లో మొదటి సినిమాగా మేకర్స్ ప్రొజెక్ట్ చేస్తున్న ఈ చిత్రం ఇపుడు అన్ని పనులు పూర్తి చేసుకొని ఎట్టకేలకి గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది. ఇక ఈ చిత్రానికి జీవి ప్రకాష్ సంగీతం అందిస్తుండగా క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాతో వెండితెర ఎంట్రీ ఇవ్వబోతున్నారు. అలాగే మైత్రి మూవీ మేకర్స్ గట్టి బడ్జెట్ తోనే ఈ సినిమాని తెరకెక్కించారు.




## ఏపీ ప్రభుత్వానికి ముస్లింలు షాక్, ఇఫ్తార్ విందు బాయ్‌కాట్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరుల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఏపీ ప్రభుత్వం ఈ నెల 27న విజయవాడలో రాష్ట్రస్థాయి ఇఫ్తార్ వేడుకను నిర్వహించనుంది. ఈ ఇఫ్తార్ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారని ప్రభుత్వం తెలిపింది. అంతేకాదు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇఫ్తార్ వేడుకలు నిర్వహిస్తారు. దీని కోసం ప్రభుత్వం రూ.1.50 కోట్లు కేటాయించనుంది. రాష్ట్రస్థాయి వేడుకలకు రూ.75 లక్షలు, జిల్లాల్లో కార్యక్రమాలకు రూ.లక్ష నుంచి రూ.4 లక్షల చొప్పున అందిస్తారు. ఈ మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ విందును ముస్లింలు బాయ్‌కాట్ చేశారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కొంతమంది ఓ పోస్టర్ వేసి మరీ ప్రచారం చేస్తున్నారు.



## ఈ కారణంతో నేను ఎన్నో అవకాశాలు కోల్పోయా

'కేజీఎఫ్', 'కేజీఎఫ్-2' చిత్రాలతో పాన్ ఇండియా హీరోగా మారిపోయారు కన్నడ స్టార్ నటుడు యశ్. ఇందులో రాకీ భాయ్ పెర్ఫార్మెన్స్ కు ఫిదా కాని సినీ అభిమాని లేడంటే అతిశయోక్తి కాదు. అంతకుమించి అనేలా నటనతో పాన్ ఇండియా స్థాయిలో అందరినీ యశ్ ఆకట్టుకున్నారు. ప్రస్తుతం ఆయన తన తర్వాతి ప్రాజెక్టుగా 'టాక్సిక్'లో నటిస్తున్నారు. అయితే, తాజాగా 'మనద కదలు' అనే సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న సవాళ్లను యశ్ గుర్తు చేశారు. చాలా మంది దర్శక నిర్మాతలు తనకి పొగరనుకున్నారని, దాని ఫలితంగా ఎన్నో మంచి అవకాశాలు కోల్పోయానని చెప్పారు. హీరో యశ్ మాట్లాడుతూ... "కెరీర్ ఆరంభంలో నటుడిగా నన్ను నేను నిరూపించుకోవడానికి చాలా కష్ట పడ్డా. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అనుకునేవాడిని. ఈ క్రమంలో ఏదైనా ప్రాజెక్ట్ కోసం నన్ను కలిసిన దర్శకులను పూర్తి స్క్రిప్ట్ చెప్పాలని అడిగేవాడిని. అది కొంతమందికి నచ్చేది కాదు. దాంతో వారు నాకు పొగరనే ముద్ర వేశారు. ఈ కారణంతో నేను ఎన్నో అవకాశాలు కోల్పోయా. అలాంటి సమయంలో నిర్మాత కృష్ణప్ప నాకు ఎంతో మద్దతిచ్చారు. నాపై నమ్మకం ఉంచారాయన. ఈ క్రమంలో దర్శకుడు శశాంక్ నాకు పూర్తి స్క్రిప్ట్ వివరించడంతో మొగ్గిన మనసు సినిమా సెట్ అయింది. ఇప్పటికీ నాకు ఆ చిత్ర బృందం అంటే ఎంతో గౌరవం" అని యశ్ చెప్పుకొచ్చారు.



## నా వ్యాఖ్యలు విత్ డ్రా చేసుకుంట : స్పీకర్

తెలంగాణ అసెంబ్లీ తొమ్మిదోరోజు బడ్జెట్ సమావేశాల్లో వివిధ శాఖల పద్దులపై చర్చ కొనసాగుతున్నది. అయితే నిన్న సభలో తన వ్యాఖ్యల వల్ల ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మనసు కష్టపడితే నా వ్యాఖ్యలను విత్ డ్రా చేసుకుంటానని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఇవాళ సభ ప్రారంభమైన తర్వాత ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ- - - స్పీకర్ వ్యాఖ్యలు నాకు బాధకలిగించాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎక్కడా పరిధి దాటి మాట్లాడలేదని అయినా తన పట్ల స్పీకర్ అలా మాట్లాడటం చాలా బాధేసిందన్నారు. నా విషయంలో మీరు చేసిన వ్యాఖ్యలు మీకు సబబు అనిపిస్తే రికార్డులో ఉంచండి లేదా వాటిని రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. అనంతరం స్పందించిన స్పీకర్- - - సునీతా లక్ష్మారెడ్డి అంటే నాకు ఎనలేని గౌరవం ఉందని, నాకు 8 మంది సోదరీమణులు ఉన్నారు. మహిళలను నేను ఎక్కువగా గౌరవిస్తానన్నారు. ఈ చైర్ నుంచి నేను మిమ్మల్ని అన్నాననుకోవడం చాలా పొరపాటు. మీరు మాట్లాడుతున్న సమయంలో ఇరు వైపుల నుంచి వచ్చిన రన్నింగ్ కామెంటరీ కారణంగా ఆ వ్యాఖ్యలు చేశాను తప్ప అవి మిమ్మల్ని ఉద్దేశించి కావు అని స్పీకర్ తెలిపారు. ఒకవేళ నేను చేసిన వ్యాఖ్యలు మీ మనసును కష్టపెట్టి ఉంటే ఆ వ్యాఖ్యలను వాటిని విత్ డ్రా చేసుకుంటున్నానని అన్నారు.

## బీజాపూర్ సరిహద్దు ప్రాంతంలో మరోసారి ఎన్ కౌంటర్

ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ అడవులు మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లాయి. భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లలో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. బీజాపూర్ – దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఉన్న గంగలూరు పరిధి అండ్రి అడవుల్లో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నారనే సమాచారం వచ్చింది. దీంతో జిల్లాల నుంచి సంయుక్త బలగాలు ఉదయం 7గంటల నుంచి అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# అదృష్టం కూడా కలిసి రావాలి..

## విప్రాజ్ మా నుంచి మ్యాచ్ లాగేసుకున్నాడు

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా నిన్న (మార్చి 24) జరిగిన ఉత్కంఠ పోరులో లక్నో సూపర్ జెయింట్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ వికెట్ తేడాతో గెలుపొందింది. లక్నో నిర్దేశించిన 210 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఆదిలోనే చేతులెత్తేసిన ఢిల్లీని అశుతోష్ శర్మ (31 బంతుల్లో 66 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు), విప్రాజ్ నిగమ్ (15 బంతుల్లో 39; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) సంచలన ఇన్నింగ్స్‌లు ఆడి గెలిపించారు. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ గెలుస్తుందని ఎవరూ ఊహించలేదు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో.. మిచెల్ మార్ష్ (36 బంతుల్లో 72; 6 ఫోర్లు, 6 సిక్సర్లు), నికోలస్ పూరన్ (30 బంతుల్లో 75; 6 ఫోర్లు, 7 సిక్సర్లు) విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో విరుచుకుపడటంతో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. మార్ష్, పూరన్ మినహా లక్నో ఇన్నింగ్స్‌లో ఎవరూ రాణించలేదు. వీరిద్దరూ బ్యాటింగ్ చేస్తున్నంత సేపు లక్నో 250 పైచిలుకు పరుగులు సాధిస్తుందని అంతా అనుకున్నారు. అయితే మార్ష్, పూరన్ ఔటయ్యాక ఆ జట్టు మిడిలార్డర్ అనూహ్యంగా కుప్పకూలింది. రిషబ్ పంత్ 6 బంతుల్లో డకౌట్ కాగా.. ఆయుశ్ బదోని 4, శార్దూల్ ఠాకూర్ 0, షాబాజ్ అహ్మద్ 9, బిష్ణోయ్ 0 పరుగులకు ఔటయ్యారు. చివరి ఓవర్‌లో డేవిడ్ మిల్లర్ (19 బంతుల్లో 27 నాటౌట్; ఫోర్, 2 సిక్సర్లు) రెండు సిక్సర్లు బాదడంతో లక్నో 200 పరుగుల మార్కును దాటింది. ఢిల్లీ బౌలర్లలో స్టార్క్ 3, కుల్దీప్ 2, విప్రాజ్, ముకేశ్ కుమార్ తలో వికెట్ తీశారు. అనంతరం 210 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఢిల్లీ.. 65 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి గెలుపుపై ఆశలు వదులుకుంది. ఈ దశలో అశుతోష్ అద్భుతం చేశాడు. ట్రిస్టన్ స్టబ్స్ (22 బంతుల్లో 34; ఫోర్, 3 సిక్సర్లు), విప్రాజ్ నిగమ్ సాయంతో ఢిల్లీకి ఊహించని విజయాన్నందించాడు. చివరి ఓవర్ మూడో బంతికి సిక్సర్ కొట్టి తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఢిల్లీ ఇన్నింగ్స్‌లో డుప్లెసిస్ (29), అక్షర్ పటేల్ (22) రెండంకెల స్కోర్లు చేయగా, మిగతా వారంతా సింగిల్ డిజిట్లకే పరిమితమయ్యారు. లక్నో బౌలరల్లో శార్దూల్ ఠాకూర్, మణిమారన్ సిద్దార్థ్, దిగ్వేశ్ రతీ, రవి బిష్ణోయ్ తలో రెండు వికెట్లు తీశారు. కాగా, ఈ మ్యాచ్‌లో లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ ఆ జట్టు ఓటమికి ప్రత్యక్ష కారకుడయ్యాడు. తొలుత బ్యాటింగ్‌లో 6 బంతులు ఆడి డకౌటైన పంత్.. ఛేదనలో (ఢిల్లీ 9 వికెట్లు కోల్పోయిన దశలో) చివరి ఓవర్ తొలి బంతికి స్టంపింగ్ మిస్ చేసి లక్నో చేతుల్లో నుంచి మ్యాచ్‌ను వదిలేశాడు. పంత్ ఈ స్టంపింగ్ చేసుంటే లక్నో మ్యాచ్ గెలిచేది. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ పంత్ ఇలా




అన్నాడు. మా టాపార్డర్ బ్యాటర్లు చాలా బాగా ఆడారు. ఈ వికెట్‌పై ఇది చాలా మంచి స్కోర్. దురదృష్టవశాత్తు మేము ఆ స్కోర్‌ను కాపాడుకోలేకపోయాము. మేము ప్రారంభంలో వికెట్లు తీసినప్పటికీ.. ఇది బ్యాటింగ్ చేయడానికి మంచి వికెట్ అని తెలుసు. వారు (ఢిల్లీ) రెండు మంచి భాగస్వామ్యాలు (స్టబ్స్‌తో, విప్రాజ్ నిగమ్‌తో అశుతోష్) నెలకొల్పారు. విప్రాజ్ నిగమ్ చాలా బాగా ఆడాడు. అతడే మా నుంచి మ్యాచ్‌ను దూరం చేశాడు. బౌలర్లకు ఈ పిచ్‌పై తగినంత ఉంది. కానీ మేము కొన్ని బేసిక్స్ మిస్ అయ్యాము. చివర్లో ఒత్తిడికి లోనయ్యాము. ఇది ఇంకా తొలి మ్యాచే. ఓటమిని అధిగమించి ట్రాక్‌లో పడతాము. ఈ మ్యాచ్ నుండి తీసుకోవలసిన సానుకూల అంశాలు చాలా ఉన్నాయి. ఖచ్చితంగా ఈ ఆటలో అదృష్టం కీలక పాత్ర పోషిస్తుంది. స్టంపింగ్ మిస్‌పై స్పందిస్తూ.. బంతి మోహిత్ ప్యాడ్‌లకు తాకకపోయుంటే స్టంపింగ్‌కు అవకాశం ఉండేది. క్రికెట్లో ఇలాంటివి జరుగుతూ ఉంటాయి. వీటినే పట్టించుకుంటూ పోతే ఆటపై దృష్టి పెట్టలేము.


## శివ బాలాజీ పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను రిలీజ్ చేశారు




డైనమిక్ హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన 'కన్నప్ప' ఏప్రిల్ 25న థియేటర్లోకి రాబోతోంది. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మించగా ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన కన్నప్ప పోస్టర్లు, టీజర్లు, పాటలు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో కన్నప్ప టీం ప్రమోషన్స్‌ను మరింతగా పెంచేసింది.ప్రతీ సోమవారం నాడు కన్నప్ప సినిమా నుంచి ఓ అప్డేట్ వస్తుండటం ఆనవాయతీగా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ సోమవారం నాడు శివ బాలాజీ పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను రిలీజ్ చేశారు. కన్నప్ప చిత్రంలో శివ బాలాజీ 'కుమారదేవ శాస్త్రి' పాత్రను పోషించారు. ఈ కారెక్టర్‌ను రివీల్ చేస్తూ వదిలిన పోస్టర్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. శివ బాలాజీ ఓ ముని వేషంలో కనిపిస్తున్నారు. ఎంతో నేచురల్‌గా శివ బాలాజీ ఈ లుక్‌లో కనిపిస్తున్నారు. ఇప్పటికే శివయ్యగా అక్షయ్ కుమార్, పార్వతీ మాతగా కాజల్ అగర్వాల్‌ను, రుద్రుడిగా ప్రభాస్‌ను, మహదేవ శాస్త్రిగా మోహన్ బాబు పాత్రలకు సంబంధించిన పోస్టర్లు అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ట్రైలర్‌ను రిలీజ్ చేసేందుకు కన్నప్ప టీం సంసిద్ధం అవుతోంది.

## వలసదారుల ప్రయాణాలపై అమెరికా నజర్

గ్రీన్‌కార్డు పొందినంత మాత్రాన వారికి అమెరికాలో ఎల్లకాలం ఉండిపోయే హక్కు లేదు అంటూ అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు లక్షలాది మంది వలసదారుల్లో, ముఖ్యంగా భారత సంతతి వారిలో గుబులు రేపుతున్నాయి. దీనికి అనుగుణంగానే గత కొన్ని వారాలుగా అమెరికా తమ వలస చట్టాలను మరింత కఠినతరం చేయడం వలసదారుల ఆందోళనను మరింత పెంచుతోంది. ఈక్రమంలోనే ఇటీవల యూఎస్ ఇమిగ్రేషన్ అటార్నీ అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేశారు. హెచ్-1బీ, ఎఫ్-1, గ్రీన్‌కార్డు కలిగిన భారతీయులు ప్రయాణాల్లో అప్రమత్తత పాటించాలని సూచించారు. వీరు అమెరికాలో ప్రవేశించే, నిష్క్రమించే సమయంలో తనిఖీలు మరింత ఎక్కువగా ఉంటాయని, సహనంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 43 దేశాలకు చెందిన పౌరులు అమెరికాలోకి రాకుండా నిషేధం విధించాలని ట్రంప్ సర్కారు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వలసదారుల ప్రయాణాలపై అధికారులు ప్రత్యేక దృష్ట సారించింది. భారత్ ఈ ఆంక్షల జాబితాలో లేనప్పటికీ.. అమెరికా వెలుపల ప్రయాణాలు చేయాలనుకునే భారతీయులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.గ్రీన్‌కార్డు, హెచ్-1బీ, ఎఫ్-1 వీసాలపై ఉన్న భారతీయులు




అమెరికాలో ప్రవేశించే, నిష్క్రమించే సమయంలో తనిఖీలు ఎక్కువగా ఉంటున్నందున వీసా స్టాంపింగ్‌కు ఆలస్యం అవొచ్చని పేర్కొంటున్నారు. వలసలకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేయడం వల్లే వ్యక్తుల వివరాలను ఆరా తీసేందుకు ఎక్కువ సమయం పడుతోందని అన్నారు. విదేశాల్లో ఎక్కువకాలం ఉండి అమెరికాకు తిరిగొచ్చే వలసదారులు కస్టమ్స్, బోర్డర్ అధికారులు అడిగే సుదీర్ఘ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వలసదారులంతా తమ స్వదేశ పాస్‌పోర్ట్‌తో పాటు అన్ని పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని అధికారులు సూచించారు. గ్రీన్‌కార్డు, వీసా, రీఎంట్రీ పర్మిట్, ఎంప్లాయింట్ వెరికేషన్ లెటర్, ఫెడరల్ ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లింపులు, వేతన స్లిప్పుల వంటివి సరిచూసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులైతే సంబంధిత కాలేజీ, యూనివర్సిటీ ఇచ్చిన అనుమతి పత్రంతో పాటు, యూఎస్ బ్యాంకు ఖాతా వివరాల వంటివి చూపించాలన్నారు.



భీమదేవరపల్లిలో కారును ఢీకొట్టిన లారీ..

## పాస్టర్ దుర్మరణం

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంగళవారం తెల్లవారుజామున ముల్కనూరు-ఎల్కతుర్తి ప్రధాన రహదారిపై గోపాల్ పూర్ క్రాసింగ్ సమీపంలో వేగంగా దూసుకొచ్చిన లారీ ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. దీంతో ఓ చర్చి పాస్టర్ అక్కడికక్కడే మరణించారు. ప్రమాదం ధాటికి కారు ముందుభాగంగా నుజ్జునుజ్జు అయింది. గోదావరిఖనికి చెందిన కనకపుడి కరుణాకర్ కరీంనగర్‌లోని ఓ చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున హనుమకొండ నుంచి కరీంనగర్‌కు తన కారులో బయల్దేరారు. అయితే హుజూరాబాద్ రహదారిలో రోడ్డు పనులు జరుగుతుండటంతో హుస్నాబాద్ నుంచి వెళ్తున్నారు. ఈ క్రమంలో గోపాల్‌పూర్ క్రాసింగ్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ.. కారును ఢీ కొట్టింది. దీంతో ఆయన ఘటనా స్థలంలోనే మృతిచెందారు. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అవడంతో కరుణాకర్ అందులోనే ఇరుక్కుపోయారు. లారీని అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. కాగా, రోడ్డుపై వెళ్తున్న ప్రయాణీకులు పోలీసులకు, 108కి సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. అతికష్టంపై మృతదేహాన్ని అందులోనుంచి బయటకు తీశారు. మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రి కి తరలించారు.

## నంబర్ల గురించి ఆలోచించను

'ది కేరళ స్టోరీ' కాంబినేషన్ రిపీట్ చేస్తూ దర్శకనిర్మాతలు సుదీప్తోసేన్, విపుల్ అమృత్‌లాల్ షా తెరకెక్కించిన చిత్రం 'బస్తర్: ది నక్సల్ స్టోరీ'. ఆదా శర్మ ప్రధాన పాత్రలో రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయి విజయాన్ని అందుకోలేకపోయింది. తాజాగా ఈ పరాజయం గురించి ఆదా శర్మ మాట్లాడింది. 'హిట్ సినిమాలో నటించడం కంటే మంచి సినిమాలో నటించడాన్ని ఎక్కువ ఎంజాయ్ చేస్తా. నా పాత్రకు వందశాతం న్యాయం చేశానా, లేదా అనేది మాత్రమే ఆలోచిస్తా. ఒక సినిమా హిట్ అవ్వడానికి. ఫ్లాప్ అవ్వడానికి రకరకాల కారణాలుంటాయి. వాటి గురంచి నేను పట్టించుకోను. నా సినిమా ఎంత వసూలు చేసింది, అనే విషయాన్ని కూడా నేను పట్టించుకోను. నంబర్ల గురించి ఆలోచిస్తే పాత్రపై దృష్టి పెట్టలేం.





ఓయూలో ఆంక్షలపై చర్చించండి..

## బీఆర్ఎస్ వాయిదా తీర్మానం

ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలపై అసెంబ్లీలో చర్చించాలంటూ బీఆర్ఎస్ పార్టీ వాయిదా తీర్మానం ఇచ్చింది. విద్యార్థుల ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ర్యాలీలు, ధర్నాలు, నిరసనలపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపింది. దీనిపై శాసనసభలో చర్చించాలని ప్రతిపాదించింది. ఈమేరకు అసెంబ్లీ కార్యదర్శికి వాయిదా తీర్మానం అందించింది.

### ఉస్మానియా వర్సిటీపై ఉక్కుపాదం..

ఎన్నో ఉద్యమాలకు వేదికైన ఉస్మానియా యూనివర్సిటీపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పోరాటాలకు ఊపిరిలూదిన విద్యార్థిలోకంపై కక్షగట్టింది. ఏకంగా ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ ఆవరణలో ఆందోళనలపై ఈ నెల 15న నిషేధం విధించింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారులపై ఆనాటి పాలకులు ఊరూరా ఉక్కుపాదం మోపుతున్న తరుణంలోనూ ఓయూ విద్యార్థి ఉద్యమంపై ఎలాంటి నిషేధాజ్ఞలు విధించలేదు. కానీ, నేడు 'ప్రతికూల ప్రభావం' అంటూ సాకుగా చూపి రేవంత్ సర్కారు అణచివేత చర్యలకు దిగింది.

## న్యూజిలాండ్‌ను వణికించిన భారీ భూకంపం

న్యూజిలాండ్‌ను భారీ భూకంపం వణికించింది. సౌత్ ఐలాండ్ పశ్చిమ తీరంలో మంగళవారం ఉదయం భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 6.7గా నమోదైనట్లు న్యూజిలాండ్ అధికారులు తెలిపారు. భారత కాలమానం ప్రకారం ఈరోజు ఉదయం 7.15 గంటల ప్రాంతంలో న్యూజిలాండ్ పశ్చిమ నైరుతి తీర ప్రాంత పట్టణం రివర్టన్ సమీపంలో భూకంపం సంభవించినట్లు వెల్లడించారు. అయితే, భూకంపం తీవ్రత 6.5 నుంచి 6.8 మధ్య ఉండే అవకాశం ఉందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే పేర్కొంది. సౌత్ ఐలాండ్ నైరుతి నుంచి 10 కిలోమీటర్ల (6.2 మైళ్ళు) లోతులో సంభవించినట్లు వెల్లడించింది. అయితే ఈ భూకంపం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు తెలియరాలేదు. భూకంపం తీవ్రత భారీ స్థాయిలోనే ఉండటంతో నష్టం సంభవించి ఉంటుందని స్థానిక మీడియా భావిస్తోంది. ఇక ఇప్పటివరకూ ఈ ప్రాంతానికి ఎలాంటి సునామీ హెచ్చరికలూ జారీ చేయలేదు. కానీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. మరోవైపు ఈ భూ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు..





## న్యూ ఢిల్లీపై మరోసారి నోరుపారేసుకున్న కెనడా

భారత్‌పై కెనడా మరోసారి నోరు పారేసుకుంది. ఆ దేశంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకునే అవకాశం ఉందని ఆ దేశ స్పై ఏజెన్సీ ఆరోపించింది. భారత్‌తోపాటు చైనా, రష్యా, పాకిస్థాన్ దేశాలు కూడా ఆ ప్రయత్నం చేయొచ్చన్న అనుమానాలు వ్యక్తం చేసింది. కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ వానెస్సా లాయిడ్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'త్వరలో మా దేశంలో జరగబోయే ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు పీఆర్సీ (పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా) ఏఐ ఆధారిత సాధనాలను ఉపయోగించే అవకాశం ఉందని మాకు సమాచారం ఉంది. ఈ ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునే ఉద్దేశం, సామర్థ్యం భారత ప్రభుత్వానికి కూడా ఉందని మేం భావిస్తున్నాం. రష్యా, పాకిస్థాన్ దేశాల కూడా ఆ ప్రయత్నాలు చేయొచ్చు' అని లాయిడ్ ఆరోపించారు.